


# అవతారసమాప్తి

ఆర్. వి. జి. కృష్ణమూర్తి

మా పశుపతి బాబాయి అవతార పురుషుడు. ఈ విశేషణం విష్ణుదేవుని కన్నా మా బాబాయికే బాగా అన్వయిస్తుందేమోనని నా అనుమానం! ఎందుకంటే ఆయన ఎత్తి ఎత్తి పది అవతారాలు మాత్రం ఎత్తగలిగాడు. ఇక మా బాబాయి ఎత్తిన అవతారాలంటేనా, అవి అసంఖ్యాకం. మరి కొంత వివరంగా చెప్పాలనుకుంటే నాకు వ్రాయడానికి మీకు చదవడానికి సాధ్యం కానన్ని!

దుర్మార్గుల్ని శిక్షించి సజ్జనుల్ని రక్షించి ధర్మాన్ని సంస్థాపనం చేసేందుకు తను అవతారాలు ఎత్తవలసి వుంటుందని సెలవిచ్చారు గీతాచార్యులు. మా బాబాయి అవతారాలకు ఇంతటి పెద్ద ప్రయోజనాలేవీ వున్నట్టు కనిపించవు. వాటివలన ఆయన సాధించిన మహా కార్యాలూ లేవు. మరైతే ఈయన అవతారాలెందుకెత్తుతున్నాడంటే-ఇదంతా ఈయన లోక లీలావినోద మన్నమాట!

అందులో మళ్ళీ ఒక విశేషముంది. విష్ణుదేవుడు ఒక్కొక్క అవతారాన్ని ఒక్కొక్కసారి మాత్రమే ఎత్తాడు. మా బాబాయి సంగతి అలా కాదు. ఊళ్ళో కలహాలు ముదిరినప్పుడల్లా ఈయన కోర్టుపక్షి అవతారం ఎత్తగలడు. ఇరుగింటి పొరుగింటి తగాదాల సమయాల్లో ఈయన 'మర్యాదరామన్న' అవతారం ఎత్తగలడు. ఎన్నికల సంరంభం చెలరేగినప్పుడల్లా ఛోటా రాజకీయవేత్తగా అవతారం దాల్చగలడు. అలాంటి ప్రజ్ఞావిశేషాలుగల బాబాయిని దర్శనమాత్రంలోనే ఏ అవతారంలో వున్నాడో కనిపెట్టడం సాధ్యంకాని పని!

* * *

రంగమహల్‌కు క్రొత్త సినిమా వచ్చింది. టిక్కెట్లు అడ్వాన్సుగా బుక్ చేసుకోనేందుకు త్వరత్వరగా వెళుతున్నాను. గాంధీ విగ్రహం దాటి మలుపు తిరగ్గానే ఓ ప్రక్కనుంచి "ఒరేయ్, వేణూ!" అన్న పొలికేక వినిపించింది. ఓ క్షణం అలా ఆగానో లేదో చెవులు బద్దలయ్యేంత శబ్దంతో నవ్వుతుంటూ, బుల్ డోజర్లా దొర్లుకుంటూ వచ్చాడు పశుపతి బాబాయి!

సృష్టికార్యానికి పూనుకున్న విధాత క్రితంరాత్రి కేళీవిలాసంలో సరస్వతి తనను మైమరపించి పులకరింప చేసిన విధానం స్మృతికి రావడంవల్లనో, లేక ఏ భక్తుడైనా తానిచ్చినవరం తన చాపక్రిందికి నీళ్ళు తేబోతూందన్న ఆలోచన వల్లనో పరాకు-బడి, మా బాబాయిని సృష్టి చేసేటప్పుడు యిద్దరికి యిమడ్చవలసిన దంతాలు ఒక్క మా బాబాయినోటికే తగిలించి పంపేశాడు పాపం!

చిన్ననాటినుంచి అటు దేహానికిగానీ యిటు మెదడుకుగానీ ఏలాంటి శ్రమ లేనందువల్ల, బాబాయి శరీరంమాత్రం అవధుల లేకుండా పెరిగింది గాని మెదడుమాత్ర




సరియైన సహవాసి

టాటావారి యు డి కొలోన్ సెంటు పురుషులు స్త్రీలు యిరువురికీ పరిశుభ్ర పరచుటలో దివ్యమైనది ... దాని మనోల్లాసకరమైన చల్లదనము మిమ్ములను హాయిగానుంచును.

టాటావారి యు డి కొలోన్ సోపు — దాని గుణమునకు తగిన పరిమళముగలది ...

దాని తాజాదనము చెడకుండా నిలవుండుటకై ప్రత్యేక బంగారు రేకు కాగితపు రేపర్‌లో ప్యాక్ చేయబడినది.

**ఇవి టాటా ఉత్పత్తులు-కనుక ఇవి మంచివని మీకు తెలియును**

# అవతార సమాప్తి

ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే వుండిపోయింది.

ఎక్కడికైనా వెళ్లాలంటే తలమీద ఓ గొడుగూ, చంకలో దినపత్రికా, చేతిలో సంచీ, కాళ్ళకు పాదరక్షలూ—యీ సరంజామాలతో కదలివెళ్లే బాబాయిని దూరం నుంచి చూస్తుంటే, ఓ పర్వతం చెట్లూ, చేమలూ, రాళ్ళూ, గుట్టలూతో సహా కదలి వెళ్తున్నట్టుంటుంది.

గాలికొట్టిన బండిలా పెరిగిపోయిన శరీరాన్ని అదుపులో పెట్టలేని బాబాయి, తన క్రాపునుమాత్రం సర్వవిధాలా బెదిరించి, అదుపులోపెట్టి సమ్మర్ క్రాపును చిరస్థాయిగా నిలిపాడు తలమీద!

"సినిమా టిక్కెట్లకేనట్రా! నాకూ ఒకటి తీసుకురావోయ్" అన్నాడు

"సరేలే. ఎప్పుడొచ్చావేమిటి?" అన్నాను.

"ఈమధ్య మన కాపురం యిక్కడేగా" అన్నాడు ఏదో సంతృప్తిని ముఖంలోకి తెచ్చుకుంటూ.

చెమటకు తడిసిన తెల్లటి చొక్కా శరీరానికి అతుక్కుపోయినందువల్ల లావుపాటి యజ్ఞోపవీతం బయటికి కనిపిస్తూంది.

"ఏమిటి సంగతి బాబాయ్?" అన్నాను.

"అవింతా సాయంకాలం చెబుతాలే. రామ్మూర్తి నగర్‌లో గిరిధర్రావుగారి మేడ వుంది చూశావ్! అంతా అక్కడే వుంటున్నాం. సాయంకాలం రావోయ్" అంటూ కదిలాడు బాబాయ్ మళ్ళీ వెనక్కు తిరిగి "టిక్కెట్టు మరచిపోకగోయ్" అని అరిచాడు. బాబాయికి పట్నంలో కాపురం వెలిగించాలనీ, పట్నవాసపుబాయ్ అనిపించుకోవాలనీ ఆశ!

ఓ శుభోదయాన బాబాయి మనసులో మసాలాదోసె తినాలన్న కోరిక కలగడంతో, తక్షణం తన బాడిని తనే పట్టుకుచూచి, తీరని అనారోగ్యం తనని బాధిస్తూందని భావించి, భార్యని కేకేసి త్వరగా రెండు ధోవతులూ, రెండు చొక్కాలూ సంచిలో కుక్కమని ఆర్డరు జారీచేసి మరో గంటలో పట్నంలో వాలాడు. తన స్వల్పమైన కోరికలన్నీ తీర్చుకుని, జేబు ఖాళీ చేసుకుని గాని మళ్ళీ వూళ్లో అడుగెట్టడు బాబాయి.

అప్పుడప్పుడూ అనేవాడు నాతో— "ఒరే అబ్బాయ్, పట్నంలో వుండేవాళ్ళదిరా జీవితమంటే! మాదేమిటి! ఎప్పుడూ తగూలూ, తీర్పులూ" అని మా బాబాయి వాళ్ళ గ్రామానికి పంచాయతీబోర్డు వైస్ ప్రెసిడెంటు. ఆ పదవి కెన్నికైననాడు ఆయనపడ్డ సంబరం అంతా యింతా కాదు.

ఇంత గొప్ప పదవి నలంకరించిన తనకు యిక మీదట ఇండియా వైస్ ప్రెసిడెంటు పదవి వంగుకోవడంకూడా ఏమంత దుస్తరమైన విషయంకాదు — అన్నట్టు మాట్లాడాడు.

ఊళ్లో ఎక్కడైనా ఓ తగాదా జరిగినట్టు బాబాయి చెవిని పడడంతో తక్షణం యిరుపక్షాలవారిని పిలిపించి "మేమప్పుడే రాజీపడ్డాం బాబో" అని వాళ్ళు మొత్తుకున్నా వినకుండా "పంచాయతీ తంతు" అంతా నడిపించి ఆ తర్వాత వెళ్ళనిచ్చేవాడు. ఆ కార్యక్రమాన్ని కొనసాగించేప్పుడు బాబాయి ప్రదర్శించే తెలివి, దర్జా వగైరాలన్నీ సుప్రీంకోర్టు న్యాయాధికార్లుగూడా వచ్చి చూచి నేర్చుకోవలసిందే!

కోర్టు వ్యవహారాల్లో తిరిగేవాళ్ళందరూ బాబాయిదృష్టిలో వీరులూ, శూరులూ, పిసలైన సింహాలూ! కాని తాను యింతవరకూ కోర్టుకెక్కి, ఒక్కసారైనా ఆ 'బోను'లో అడుగెట్టలేదే అన్న బెంగ అయన్ని ఎప్పుడూ పీడిస్తూ వుంటుంది. ఆ కాస్త ముచ్చటా తీర్చుకు నేందుకు ఓ యిద్దరివద్ద నోటు వ్రాసి పైకం పుచ్చుకున్నాడు మళ్ళీ ఎవాళ్ళకీ బాకీ తీర్చలేదు. బాకీదార్లు అడిగితే "కోర్టుకుపోతయ్యా, చేతనైతే" అన్నాడు. రాజానైనా గావచ్చు, మొండివాడ్ని గెలవడం దుస్తరం అనుకుని వాళ్ళు వేరు విధంగా చెవులు మెలేసి వసూలు చేసుకున్నారు. "ఇక యీ జీవితంలో తనకు కోర్టుకెక్కే ఆశలేదు," అనుకున్నప్పుడు బాబాయి హృదయం జివ్వు జివ్వుమని లాగుతుందట! తన కాంక్ష రిక్తకాంక్ష అయిపోతుందేమో అనుకున్నప్పుడు బ్రతుకుమీద ఓ విసనమైన జుగుప్స కలుగుతుందట!

అలాంటి బాబాయి ఈనాడు ఏదైనా కోర్టు వ్యవహారంలో పూర్తిగా మునిగి బస్తీకి కాపురం మార్చేడేమో అనుకున్నాను. కానీ నా ఆలోచనన్నీ ఒక్క క్షణంలో తరగ్గొట్టేశాడు బాబాయి. ఆ రాత్రి సినిమాలో యింటర్వెల్లయిన తరువాత స్లైడ్లువేయడం ప్రారంభించారు "పశుపతి ఫ్యాన్సీ స్టోర్స్" అన్న స్లైడు తెరమీద పడగానే మోచేత్తో ఒక్కపోటు పొడిచాడు బాబాయి నా డొక్కలో!

బాబాయికి కోర్టుపిచ్చి, పట్నవాసపు పిచ్చి, రాజకీయాల పిచ్చిమాత్రమే వున్నట్టు అందరికీ తెలుసు. వీటికితోడు వ్యాపారపు పిచ్చి వున్నట్టు ఎవ్వరికీ తెలీదు.

"నువ్వు వ్యాపారము చేస్తున్నావా బాబాయ్" అన్నాను.

గర్వంగా చూచాడు బాబాయి నావైపు. తెరమీద ఆ స్లైడు పోయి మరోటి వచ్చింది.

"ఒరే!...అప్పుడే తీసేశాడ్రా మన స్లైడు. రేపొద్దున జ్ఞాపకం చెయ్యి... వాడికో కప్పు కాఫీ పోయిద్దాం. కనీసం రెండు నిమిషాలయినా నిలిపేట్టు చెప్పాలి" అన్నాడు.

ముందు కుర్చీపై మరెవ్వరూ కూర్చోకుండా ముందే తన కండువా దానిపై వేసి, తెల్లార్లుగానే రెండు కాళ్ళూ దానిపై బార్లా జాపి. అదేదో హంసతూలికా తల్పం పైన పవళించినంత సుఖంగా నిద్రించే బాబాయి, ఈనాడు ఇంటర్వెల్లు పూర్తయే వరకూ మేలుకొనే వున్నందుకు కారణం అప్పుడర్థమైంది నాకు!

ఆ తర్వాత క్షణంలో నే నిద్ర కుపక్రమించాను. ఒకసారి మేలుకొనే వున్నందుకు నిదర్శనంగా తొడమీద చేత్తో తాళం వేయడం ప్రారంభించాడు బాబాయి!—ఆ సమయంలో సినిమాలో ఎవరూ పాట పాడలేదు. సరిగదా కత్తియుద్ధం గాభోలు జరుగుతూంది. మరి కాసేపటికి బాబాయి తన లౌడ్‌స్పీకరు గొంతులో 'అత కేకదట్రా ఎన్టీ రామారావ్' అన్నాడు. "ఇది హిందీ సినిమాకదా బాబాయ్" అన్నాను కొంచెం చిరాకుతో. కానీ నా జవాబు వినేలోగానే ఆయన కళ్ళు మూతలు పడ్డాయి.

సినిమా అయిపోగానే "రేపోసారి అంగడివైపు రారా" అంటూ వెళ్ళిపోయాడు బాబాయి నిద్రకళ్ళతో. నేను నాగది చేరుకుని నిద్ర కుపక్రమిస్తామని ప్రయత్నించి విఫలుడనై పోయాను. బాబాయికి వ్యాపారం చేయగల సమర్థత వుందా, లేదా అన్న ప్రశ్న లేదు! ఆయన వ్యాపారంలో ఎంత నష్టపడతాడా అన్నదే సమస్య!

మర్నాడు అంగడికెళ్లాను. ఆంజనేయ దేవాలయం ప్రక్క వీధిలో "పశుపతి ఫ్యాన్సీ స్టోర్స్" అన్న బోర్డు ఆకర్షణీయంగా వ్రాయించి తగిలించాడు కొట్టుముందు.

"ఒరే అబ్బాయ్. ఈ కాలం ఆడవాళ్ళ వల్లేరా వ్యాపారస్తులు బాగుపడేది. అందుకనే గాజులుకూడా తెప్పించి పెట్టాను" అన్నాడు. ఏదో పెద్ద వ్యాపార మర్మం తెలుసుకున్నవాడిలా.

మూడు పెద్ద అలమార్లనిండా సామాన్లు వున్నాయి. ఓ పెద్ద షోకేస్ చాలా అందంగా వుంది. అంగడిమొత్తం పరవాలేదనిపించింది. కొట్లో సామాన్లలా వున్నా బాబాయి కూర్చునే కుర్చీ, దానిమీద మెత్తటిదిండూ అందర్నీ యిట్టే ఆకర్షిస్తున్నాయి. కాఫీ ప్లాస్కూ, తమలపాకుల కట్టా, వక్కపొడి సీసా ముందు పెట్టుకూర్చున్న బాబాయి కుడుములు, వుండ్రాళ్ళూ ముందెట్టుకూర్చున్న ఓ బొజ్జగణపయ్యలా వున్నాడు.

ఎవరో వచ్చి ఏదో సోప్ పేరు చెప్పి "వుందాండీ?" అన్నారు.

"వుంది" అన్నాడు బాబాయి ము సరిగా.

"ఏది" అడిగాడా వ్యక్తి.

"అదిగో" అంటూ దూరాన ఓ అలమరలో పెట్టబడిన సోపులవంక కుడిచే మూపుడు వ్రేలితో కుర్చీలో కూర్చునే చూపించాడు బాబాయి.

"ఓహో! అదా! వుండనివ్వండి." అంటూ వచ్చినతను వెళ్ళిపోయాడు. నాకు ఫక్కున నవ్వు వచ్చింది. "ఇలా సుఖంగా కూర్చుంటే బేరం సాగుతుందా బాబాయ్. 'అదిగో' అని సోపు యిక్కడినుంచే చూపడము ఏం బాగుంది? నువ్వు లేచి వెళ్ళి తెచ్చిస్తే అతను కొనేవాడుగా" అన్నాను.

'ఒరే! నీకేం అనుభవం వుందిరా? ఎవరు కొనేవాడో, ఎవరు కొననివాడో ముఖం చూస్తూనే చెప్పెయ్యొచ్చు. ఇదంతా నన్ను కుర్చీలోంచి లేపేందుకు ప్లాను రా' అన్నాడు పెద్ద మనస్తత్వ శాస్త్రజ్ఞానిలా.

మరో అమ్మాయివచ్చి ఏదో హెయిల్ సీసా కావాలంది. లేచి వెళ్ళి తెచ్చాడు బాబాయి. "వాసన అదీ బాగుంటదాండీ?" అందా అమ్మాయి.

"మీకా సందేహమే అక్కర్లేదు. చూపిస్తాగా" అంటూ బాబాయి ఆ సీసా తాలూకు సీలుకి అవతల పారేసి, వాసన చూచి "ఆహా—ఏం సువాసన...ఏం సువాసన" అంటూ అమ్మాయికి చూపించాడు. అమ్మాయి వాసన చూచి ముఖం చిట్లించుకొని అసలు కొనకుండానే వెళ్ళిపోయింది. బాబాయి ఓ సీసాడు చిట్టాముదం గటగట త్రాగినవాడిలా అయిపోయాడు.

(47 వ పేజీ చూడండి)

## నిర్వచనం

'మాండూక్యోపనిషత్తు' అనే మాటను ఇరవయ్యో శతాబ్దపు శబ్దార్థతత్వవేత్త ఇలా నిర్వచించాడు.

'మాండూక్య' అంటే కప్పలకు — 'ఉపనిషత్తు' అంటే ఆకాశం. కనుక మాండూక్యోపనిషత్తు అంటే బావుల పైవర మధ్య నుంచి కనుపించే చేటంత ఆకాశమూనూ!'

# ★ ఉపకార సమాప్తి ★

(81 - వ పేజీ తరువాయి)

"ఇలా సీలు పీకేయ్యిచ్చా బాబాయ్ చెప్పేదా పీసా వస్తుందిగా" అన్నాను. "వస్తు ఏమిట్రా. విశేషంలాంటి సీసా. మనింట్లో దీన్ని వాడేవాళ్ళు లేరావిమిటి?" అన్నాడు ఎంతో ధీమాతో.

ఓ పొడుగుపాటి వ్యక్తి పత్నీ సమేతంగా విచ్చేశాడు. బాబాయి అతి వినయ విధేయతలతో లేచినిల్చుని "ఏం కావాలండీ" అన్నాడు. ఆమె "యీరకం గాజులున్నాయండీ" అంటూ బ్యాగ్ లోంచి ఓ గాజు తీసి చూపింది. బాబాయి వెతకడం ప్రారంభించాడు ఏమీ లాభంలేక పోయింది. అలాంటి రకం లేదు గాబోలు! ఓ పది నిమిషాల తర్వాత విరామంతో పైకిలేచాడు. చెమటతో చొక్కా తడిసిపోయింది. ఆసమయంలో బాబాయి ముఖం చూడగానే అప్రయత్నంగా నా దృష్టి ప్రక్క అలమారులోని చిట్టాముదం సీసాలపైకి పోయింది!

"అవి లేవండి చూపండి,..ఇల తిన్నగా వెడితే 'కనగన హాలు' అని వుంది. అక్కడ బహుశా దొరకవచ్చు. వాళ్ళ వద్ద అన్ని రకాలూ వుంటాయి లెండి" అని వాళ్ళకు దోవకి షాపునుగురించిన సకల వివరాలు యిచ్చాడు.

బాబాయి అమాయకత్వానికి నోలు వాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు, లేకుంటే వ్యాపారంమీదున్న తర్వాత వున్న వాటినే ఎలాగో వచ్చిన వారికి నచ్చచెప్పి. యిచ్చి పంపుతాడే గాని మరోషాపును పరిచయం చెయ్యడు,

"వినకది కొంచెంగూడా గాలిరాదురా యీకొట్లోకి ఓ టేబుల్ ఫ్యానైనా కొనాలి" అన్నాడు చెమటలుకారే తన శరీరాన్ని జాలిగా చూస్తూ.

"కొంటావు బాబాయ్ ఒక్క టేబుల్ ఫ్యానేనా ఫియట్ కారు మాత్రం కొనవూ యిలాగే వ్యాపారం చేస్తుంటే. ఈరోజున కనీసం నాలుగు రూపాయలకైనా అమ్మకం జరిగిందా?"

అబ్బాయ్. కారంటే జ్ఞాపకం వచ్చింది. ఈ మధ్య వూళ్ళో మనింటి ప్రహరీ మళ్ళీ కట్టించాను. గేటు బాగా వెడల్పుగా కారు వచ్చేందుకు వీలుగా పెట్టించాను. కాని మామయ్యవున్నాడే..."

బాబాయికో మామయ్యవున్నాడు. ఆయన తన తదనంతరం నలుగురు కూతుళ్ళకూ తలా ఓ రెండెకరాలు చెందేట్టు వ్రాస్తానన్నాట్ట. ముసలాడు చచ్చిన మరుక్షణం లో తన భార్యకు చెందవలసిన భూమిని విక్రయించి ఆ డబ్బుతో కారు కొనేయాలని ఈయన ప్లాను!

మామయ్య చావనూ లేదు, భూమి అమ్మనూ లేదు, పైకం రానూ లేదు— కాని బాబాయి గేటును మాత్రం వెడల్పు చేయించి వూరుకున్నాడు. ప్రతిరోజూ తపాల బంట్రోతు నాలుగు మూలలా నల్లరంగు వేయబడ్డ కార్డు ఎప్పుడు తెస్తాడా—అని ఎదురు చూస్తూ కూర్చోటం అలవాటయిపోయింది ఈయనకి! ఇల్లూ, భార్యా, సంసారం అంటే ఏ మాత్రం పట్టించుకోని బాబాయికి ఎన్నికల్లో ఏ పార్టీవాడైనా సరే 'కాస్త సాయం చేయండీ' అని ఓ కార్డుముక్క వ్రాస్తే, యిక ఇరవై నాలుగు గంటలూ అదేధ్యాసలో పడి సర్వం మరచిపోగలడు. రాజకీయాలు మాట్లాడుతూ నిద్రాహారాలనే విస్మరించగల శక్తి గలవాడు బాబాయి!

ఉన్నట్టుండి బాబాయికొట్టు ఓవారం మూతబడింది. ఇంట్లో విచారిస్తే మద్రాసు వెళ్ళాడన్నారు. వారంరోజుల తర్వాత బాబాయి దారిలో కనిపించి మద్రాసు విశేషాలు చెబుతూ అంగడివైపు నడిచారు. "ఏం వ్యాపారాలురా' మద్రాసుకో సారి వారానికి నూరురూపాయలు ఖర్చయినయి. కాని నేను కొనుగోలుచేసింది తొంబయి రూపాయలగాజులుమాత్రమే! - రాత్రివచ్చి అంగడిలోనే గాజుల పెట్టెలన్నీ పెట్టి యింటికెళ్ళాను" - అంటూ తలుపు తెరిచాడు. లోపల ప్రవేశించగానే కళ్ళబడిన అదృశ్యం చూచి నా తల తిరిగిపోయింది. ఒకదానిపై ఒకటిగా పెట్టబడిన గాజుల పెట్టెల్ని ఏమూషికరాజమో వచ్చి పరామర్శించి వుంటుంది. పెట్టెలు క్రిందకొరిగి గాజుల్లో సగానికిపైగా పగిలిపోయాయి.

బాబాయి గట్టిగా నవ్వి హుషారుగా అన్నాడు.

"ఈరకంగా వాడు వట్టి అప్రయోజకుడు! ఏవేవో కనిపెట్టాడు - కాని ఎలుకల పుట్టుక నిరోధించేవుపాయం కనిపెట్టలేక పోయాడురా! ఈ గాజులున్నాయ్యే - ఇవి ఎన్ని పగిలినా పరవాలేదు. వుండేవాటి నమ్ముకుంటే చాలు లాభం!"

తర్వాత రెండురోజులు జ్వరంవచ్చి. అంగడివైపువెళ్ళలేకపోయాను. మూడోనాటి సాయంత్రం అలా వెళ్ళాను. రోడ్డుమలుపు తిరగ్గానే కనుపిస్తుంది కొట్లోని అందాల షోకేసు. కాని ఆనాడు అది కనుపించలేదు. ఆతురతగా "ఏమైంది బాబాయ్ షోకేసు" అన్నాను.

"లోపలుందిరా. అదిచేసినవాడు నన్ను మోసంచేశాడ్రా" అన్నాడు.

"ఏం జరిగిందో చెప్పు" అన్నాను.

"ఆ సుందరంగాడు నిన్న ఏదో మాటల్లో యీ షోకేసుపైన అద్దం గట్టిది కాదన్నాడు. చేతనైతే ఒకేసుద్దులో దాన్ని బద్దలుచెయ్-అయిదు రూపాయలిస్తానని పందెం వేశాను. పోటంతో అంతే! ఒకేసుద్దుతో అద్దం బ్రద్దలయింది. అడినమాట తప్పటం మన యింటా వంటా లేదుగా! ఐదురూపాయలూ విసిరి పారేశాను" అన్నాడు సత్యహరిశ్చంద్రుని పేరు తనే నిలబెట్టిన వాడిలా.

"నీ వ్యాపారం బాగా సాగుతుంది బాబాయ్! మూడువందల రూపాయల షోకేసు ముక్కలయిందిగాక మళ్ళీ అయిదురూపాయలిచ్చి సత్కరించావా ఆ వీరుణ్ణి! అసలు నువ్వింత వరకూ కొట్టు పెట్టాకైనా సంపాయించావా?" నిలదీసి అడిగాను.

"లేదనుకో! వ్యాపారం లాభంకోసం చేస్తున్నా ననుకుంటున్నావట్రా - ఏదో ఆత్మసంతృప్తిగానీ! అసలు దీనివల్ల రెండో వ్యవహారాలల్లాగే నిలిచిపోయాయి. మళ్ళీ పంచాయతీ బోర్డు ఎన్నికలొస్తున్నాయి కూడా" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

ఆ తర్వాత ఏదో ఇంటర్వ్యూకోసం హైదరాబాదు వెళ్ళి పదిరోజుల తర్వాత వచ్చాను. వచ్చిరావడం నేరుగా అంగడికే వెళ్ళాను. తలుపు బార్లా తెరిచివుంది యుద్ధం ముగిసినతర్వాత యుద్ధభూమిలా వుంది లోపల! ప్రక్క టెయిలర్ని "మనబాబాయ్ ఫ్యాన్సీస్టోర్ ఏమయింది?" అని అడిగాను.

"ఆయన కొంపకొండి వ్యాపారం ఎత్తేశాడు. ఈరోజే వూరెళ్ళారని కూడా చెప్పాడు" టెయిలర్.

బాబాయి వాళ్ళయింటికి తిన్నగా వెళ్ళాను. రెండు మూడు జట్కాలు అక్కడ వున్నాయి. ఇంటిముందు కూలీలు బండ్లలోకి సామాన్లు చేరవేస్తున్నారు. అందరూ ప్రయాణానికి సిద్ధంగా వున్నారు. నన్ను చూడగానే బాబాయి "సమయానికి వచ్చావురా—వ్యాపారం మానేశాను, అయినా మనలాంటివాళ్ళు వ్యాపారం చెయ్యలేరురా! ఆ అలమార్లు అవీ కొయ్యసామాను కిప్పబాడుగలోకి చెల్లువేసుకున్నాను" అంటూ 'ఏమేవ్ అప్పెట్టె తెరిచి మనవాడికి నాలుగు సబ్బులూ, రెండు హేరాయిల్ సీసాలూ యివ్వు" అని కేకేశాడు భార్యని.

వెనకాల జట్కాలో తన భారీశరీరాన్ని చేరవేస్తూ "ఇక మా తెక్కపాటు మాయింటికి సబ్బులూ, హేరాయిలూ కొనవలసిన అవసరంలేదురా" అన్నాడు. బండిగా అల్లంత దూరాన పరుగెత్తే జట్కాలోంచి బాబాయి నన్ను చూచి యికిలించిన మాటలు త్రిడైమెన్షన్ చిత్రంలోలా కనిపించాయి. బాబాయి యీ సరికొత్త అవతార చిహ్నంగా నావద్ద నిలిచిపోయిన సబ్బుబిళ్లలు, హేరాయిల్ సీసాలు "యిన్నాళ్ళకు తమకు బంధవిముక్తి కలిగిందిగదా!" అన్న సంతోషాన్ని అణచుకోలేక గాబోలు తమ వాసనన్ని నా ముక్కుపుటాలదాకా గుప్పుమంటూ విరజిమ్మాయి!! ★